కళతప్పిన బస్ బే

అధ్వానంగా.. అపరిశుభ్రంగా ఏయూ–చినవాల్తేరు రోడ్డు బస్ షెల్టర్


ఏయూ ఇన్ గేట్ బస్ బే వద్ద మొక్కల కుండీలో దర్శనమిస్తున్న మద్యం సీసాలు

బస్ బే ప్రాంగణంలో ఎండిపోయిన మొక్కలు
మందుబాబుల అసాంఘిక కార్యకలాపాలు
కన్నెత్తి చూడని అధికారులు



ఏయూక్యాంపస్: విశాఖ సుందరీకరణలో భాగంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నగరంలోని పలు ప్రాంతాల్లో బస్ షెల్టర్లను పూర్తిస్థాయిలో ఆధునికీకరించారు. వీటిలో భాగంగా మొట్టమొదటి సారిగా ఏయూ ఇన్ గేట్ వద్దనున్న చినవాల్తేరు రోడ్డు బస్ బేను మోడల్‌గా తీర్చిదిద్దారు. ఇక్కడ ఆధునిక సౌబగులు అద్దడంతోపాటు అందమైన మొక్కలతో ఆహ్లాదకరంగా మలిచారు. అటువంటి ఈ బస్ బే ప్రస్తుతం కళతప్పి అధ్వానంగా.. అపరిశుభ్రంగా తయారైంది. అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడకపోవడంతో ఈ పరిస్థితి దాపురించింది.

పచ్చదనం మాయం..

బ్యూటిఫికేషన్‌లో భాగంగా ఈ బస్ బే వద్ద భారీ పూల కుండీలు ఏర్పాటు చేసి అందమైన మొక్కలు నాటారు. కాల గమనంలో వీటి నిర్వహణ పూర్తిగా విస్మరించడంతో మొక్కలు ఎండిపోయాయి. ప్రస్తుతం ఖాళీ కుండీలు మాత్రమే దర్శనమిస్తున్నాయి. బస్ బే ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో వివిధ రకాల పూల మొక్కలు నాటి ఎంతో అహ్లాదంగా పరిసరాలను తీర్చిదిద్దారు. ప్రస్తుతం ఈ మొక్కలు సైతం చనిపోవడంతో ప్రాంగణం వెలవెలబోతోంది.

గోడలపై పోస్టర్లు..

లక్షలాది రూపాయలు వెచ్చించి ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన ఈ బస్ బే గోడలు వివిధ ప్రకటనలు, పోస్టర్లతో నిండిపోతున్నాయి. వివిధ సంస్థలకు సంబంధించిన ప్రకటనలు అతికించడం వల్ల బస్ బే అధ్వానంగా మారిపోతోంది. ఇప్పటికే బస్ బేల గోడలపై కరపత్రాలు, పోస్టర్లు అతికించకుండా చర్యలు తీసుకునే దిశగా జీవీఎంసీ పనిచేస్తోంది. మరింత శ్రద్ధగా పనిచేసి ఇటువంటి వాటిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.



బస్ బే గోడపై అతికించిన పోస్టర్లు

మందుబాబులకు నిలయం..

ఏయూ–చినవాల్తేరు రోడ్డు బస్ బే రాత్రి వేళల్లో మందుబాబులకు నిలయంగా మారుతోంది. బస్ బే వద్దనున్న మొక్కల కుండీల్లో దర్శనమిస్తున్న ఖాళీ మద్యం సీసాలే దీనికి నిదర్శనం. రాత్రి సమయాల్లో ఆకతాయిలు ఇక్కడ చేరి కూర్చోవడం, మద్యం తాగడం వంటివి చేస్తున్నారు. దీనికి పోలీసులు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది. నిరాశ్రయులు, బిచ్చగాళ్లు సైతం ఈ బస్ బేను సేదతీరడానికి వినియోగిస్తున్నారు. బస్ బేను చక్కగా తీర్చిదిద్ది, ఇక్కడి కుండీల్లో కొత్త మొక్కలు నాటే దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

ఆచార్య సరస్వతికి అభినందన


ప్రొఫెసర్ సరస్వతిని అభినందిస్తున్న వీసీ రాజశేఖర్, రిజిస్ట్రార్ ధనుంజయరావు

విశాఖ విద్య: రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పర్వదినాన ప్రతిష్టాత్మకంగా అందించిన కళా రత్న (హంస) పురస్కారానికి ఏయూ సంగీత విభాగం ఆచార్యులు కె.సరస్వతి విద్యార్థి ఎంపికయ్యారు. ఇటీవల ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని ఆమె అందుకున్నారు. దశాబ్దాలుగా సంగీత రంగంలో ఆమె చేస్తున్న సేవలు, కృషిని గుర్తిస్తూ ప్రభుత్వం హంస పురస్కారాన్ని ప్రదానం చేసింది. ఈ సందర్భంగా సోమవారం ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావులు అవార్డు గ్రహీత సరస్వతిని అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

సమతుల ఆహారంతో మెరుగైన ఆరోగ్యం

ఏయూక్యాంపస్: పోషకాలతో కూడిన సమతుల ఆహారంతో మెరుగైన ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవాలని పోషకాహార నిపుణురాలు డాక్టర్ రోహిణి పాటిల్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం బీచ్ రోడ్డులో కాలిఫోర్నియా ఆల్మండ్స్ ఆధ్వర్యంలో పోషకాహారం–ఆరోగ్య జీవనం అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. మనం నిత్యం తినే ఆహారంలో అనేక పోషకాల సమాహారం బాదంను భాగంగా చేసుకోవాలని సూచించారు. దీనిలో 15 కంటే అధికంగా పోషకాలు, ప్రొటీన్, ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు, మెగ్నీషియం, జింక్ వంటివి ఉంటాయన్నారు. కార్యక్రమంలో న్యూట్రిషన్ స్పెషలిస్ట్ షీలా కృష్ణస్వామి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రకృతి వనరుల పరిరక్షణతో ఆరోగ్యకర జీవితం


కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ సెక్టార్–7లోని వీఎంసీ డిగ్రీ కళాశాలలో సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల, గ్రీన్ క్లైమేట్ ఎన్జీవో సంస్థల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ వాతావరణాన్ని, ప్రకృతి వనరులను కాపాడుకోవడం ద్వారా ప్రతి ఒక్కరికీ ఆరోగ్యకరమైన జీవనం సాధ్యమవుతుందన్నారు. సహజసిద్ధ ఎరువులతో పండించిన పంటలను తినడం, వాతావరణాన్ని కలుషితం కాకుండా కాపాడటం ద్వారా మంచి జీవన ప్రమాణాలు సాధ్యమవుతాయని చెప్పారు. భూమిపై ఉన్న సమస్త జీవకోటికి హాని కలిగించకుండా బాధ్యతయుతంగా జీవించినప్పుడు ఆరోగ్య ప్రమాణాలు పెరుగుతాయన్నారు. పెద్ద ఎత్తున మొక్కలు నాటడంలో యువత భాగస్వాములు కావాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ కార్యదర్శి జేవీ రత్నం తదితరులు పాల్గొన్నారు.

లా విద్యార్థులకు నైపుణ్యాలు అవసరం


మాట్లాడుతున్న రవీంద్ర ప్రసాద్

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ న్యాయ కళాశాలలో సోమవారం న్యాయవాదులకు నైపుణ్యాలు, వృత్తిపరమైన మార్గాలపై సదస్సు ఏర్పాటు చేశారు. న్యాయవాద కోర్సు అభ్యసించిన విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథి విశాఖపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వైద్యుల రవీంద్ర ప్రసాద్, న్యాయవాద వృత్తి, న్యాయవాదులకు అవసరమైన నైపుణ్యాల గురించి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతామాణిక్యం, ప్రొఫెసర్ వి.రాజ్యలక్ష్మి, ప్రొఫెసర్ విజయలక్ష్మి, ప్రొఫెసర్ ఎస్.బి.చంద్రకళ, ప్రొఫెసర్ పద్మావతి, ప్రొఫెసర్ నాగభూషణ్, డా.పల్లవి మాట్లాడుతూ మూడేళ్ల ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

అప్పన్నకు కిలో మంచి ముత్యాలు అందజేత


ఈవో సుబ్బారావుకు మంచి ముత్యాలు అందజేస్తున్న బోకం శ్రీనివాస్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నగరానికి చెందిన బోకం శ్రీనివాస్ కిలో మంచి ముత్యాలను ఈవో కె.సుబ్బారావుకి అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, సూపరింటెండెంట్ త్రిమూర్తులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 10 వినతులు


అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ రమేష్

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి 10 వినతులు అందాయి. ప్రజల నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎం.రమేష్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం విద్యార్థులతోపాటు పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎ.త్రినాథ్, ఆర్ఐ ప్రేమలత, వీఆర్వోలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరామ పట్టాభిషేకం


పట్టాభిషేకంలో శ్రీరామచంద్రమూర్తి


నృత్య కళాకారులను అభినందిస్తున్న ఆలయ ఈవో దేవుళ్లు

ఏయూక్యాంపస్: బీచ్ రోడ్డులోని పాండురంగ స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీరామ నవమి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. సోమవారం శ్రీరామ పట్టాభిషేకం నేత్రపర్వంగా నిర్వహించారు. దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ ఈవో ఎ.దేవుళ్లు పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి సురేఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ స్కూల్ ఆధ్వర్యంలో శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. నాట్యం చేసిన చిన్నారులను ఆలయ ఈవో సత్కరించి, ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్, ఆలయ అర్చకుడు శ్రీరామ శర్మ, డ్యాన్స్ స్కూల్ నిర్వాహకులు ఎ.భానురేఖ తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి పథకాలకు లబ్ధిదారుల ఎంపిక నేడు

జోన్–3 కార్యాలయంలో దరఖాస్తుదారులు హాజరు కావాలి: జెడ్సీ

సీతమ్మధార: స్వయం ఉపాధి పథకాలకు 2024–2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి దరఖాస్తులు చేసుకున్న బీసీ, కాపు, బ్రాహ్మణ, క్షత్రియ, రెడ్డి, వైశ్య, ఈబీసీ కార్పొరేషన్ల నిరుద్యోగ యువత మంగళవారం ఆశీలమెట్ట జోన్–3 కార్యాలయంలో హాజరు కావాలని జోనల్ కమిషనర్ శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రకాల యూనిట్లను బ్యాంకు రుణాలు, సబ్సిడీ ద్వారా మంజూరు చేసే నిమిత్తం జోన్–3 పరిధిలోని 14 వార్డుల నుంచి 2,184 మంది లబ్ధిదారులు పెట్టుకున్న దరఖాస్తులను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 10 గంటల నుంచి కార్యాలయ సమావేశ మందిరంలో బ్యాంకుల మేనేజర్లు, జోనల్ కమిషనర్, బీసీ కార్పొరేషన్ అధికారుల సమక్షంలో దరఖాస్తుల పరిశీలన, అర్హులైన లబ్ధిదారుల ఎంపిక ముఖాముఖిగా చేస్తామన్నారు. స్వయం ఉపాధి కింద రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు మూడు సెట్ల దరఖాస్తులు, ఆన్‌లైన్‌లో పెట్టుకున్న దరఖాస్తు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జిరాక్స్‌లు, వాహనాల కోసం దరఖాస్తు చేసిన వారు డ్రైవింగ్ లైసెన్స్ జిరాక్స్, మూడు సెట్ల దరఖాస్తులు, ఒరిజినల్ ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, జిరాక్స్‌లు, యూనిట్ ఫొటో తీసుకొని జోన్–3 కార్యాలయానికి రావాలని జెడ్సీ కోరారు.

మెంటల్ హెల్త్ రివ్యూ బోర్డ్ చైర్‌పర్సన్ పోస్ట్‌కు దరఖాస్తులు

బీచ్‌రోడ్డు: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ మెంటల్ హెల్త్ రివ్యూ బోర్డ్ చైర్‌పర్సన్ పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ మానసిక వైద్య శాల సూపరింటెండెంట్ కె.రామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, దరఖాస్తులను https//visakhapatnam.nic.in వెబ్‌సైట్‌లో పొందపరిచామని పేర్కొన్నారు. అర్హత గల వారు ఈ నెల 16వ తేదీలోపు పెదవాల్తేరులోని మానసిక ఆస్పత్రి కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

బీచ్ రోడ్డులో చలివేంద్రాల ఏర్పాటు


చలివేంద్రం ఏర్పాటు చేస్తున్న కార్మికులు

ఏయూక్యాంపస్: ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో జీవీఎంసీ ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులో పలు చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆర్కే బీచ్ నుంచి వైఎంసీఏ వరకు నాలుగు ప్రదేశాల్లో చలివేంద్రాల ఏర్పాటు పనులు పూర్తి కావచ్చాయి. బీచ్ రోడ్డుకు నిత్యం వచ్చే సందర్శకులు, పర్యాటకులకు ఉపయుక్తంగా కార్మికులు వీటిని కర్రలతో నిర్మిస్తున్నారు. వీటిపై తాటాకుతో పైకప్పు వేసి అందుబాటులోకి తీసుకొస్తారు.

కళాశాల రోజులు.. విద్యార్థుల భవితకు పునాదులు


ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్‌కు జ్ఞాపిక బహూకరిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్

విశాఖ విద్య: కళాశాల రోజుల్లో విద్యార్థులు తమ పూర్తి సమయాన్ని వారి అభివృద్ధికి, నూతన ఆవిష్కరణలకు వినియోగించాలని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ సూచించారు. సోమవారం నిర్వహించిన ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం 69వ విభాగ దినోత్సవంలో ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించారు. యువత భవిష్యత్తుకు ఇంజినీరింగ్ కోర్స్ చదివే సమయంలో బలమైన పునాదులు వేసుకోవాల్సిన అవసరాన్ని తెలియజేశారు. గూగుల్ క్లౌడ్ మేనేజింగ్ డైరెక్టర్ సురేష్ ఉప్పలపాటి మాట్లాడుతూ వ్యక్తి జీవితాన్ని మూడు అంశాలు ప్రభావితం చేస్తాయని చెప్పారు. మనిషి మేధస్సుకు కష్టించేతత్వం జోడిస్తే మెరుగైన ఫలితాలు సాధిస్తామన్నారు. ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత భవిష్యత్తు సాధించాలని ఆకాంక్షించారు. తమ మేధస్సు, జ్ఞానాన్ని నూతన ఆవిష్కరణల కోసం వినియోగించాలని సూచించారు. సీఎండీ పృథ్వీతేజ్‌ను వీసీ రాజశేఖర్ సత్కరించి జ్ఞాపిక బహుకరించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

'మెడికవర్'లో విస్సో రోబోటిక్ టెక్నాలజీ


మెడికవర్ ఆస్పత్రిలో విస్సో రోబోటిక్ టెక్నాలజీ యూనిట్‌ను ప్రారంభిస్తున్న గణబాబు

ఎంవీపీకాలనీ: స్థానిక మెడికవర్ హాస్పిటల్‌లో విస్సో రోబోటిక్ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. సోమవారం ఆస్పత్రిలో రోబోటిక్ టెక్నాలజీ యంత్రాలను పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య రంగంలో రోబోటిక్ టెక్నాలజీ ద్వారా రోగులకు విలువైన సేవలు అందుతున్నాయన్నారు. డాక్టర్ ఎ.ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ విస్సో రోబోటిక్ టెక్నాలజీతో మోకాళ్ల మార్పిడి ప్రక్రియ సులభతరంగా మారిందన్నారు. గాయాలు, అధిక నొప్పి, వృద్ధాప్యం వంటి సమస్యలు తలెత్తకపోగా.. 24 గంటల్లోనే రోగి కోలుకునే వీలుందని తెలిపారు. డాక్టర్ గంగవరపు శ్రీధర్ మాట్లాడుతూ సాధారణ వైద్య విధానంలో మోకాళ్ల మార్పిడి శస్త్రచికిత్స చేశాక ఇతర సమస్యలు తలెత్తే అవకాశముందన్నారు. దీంతో రోగిని చాలా రోజులు ఐసీయూలో ఉంచాల్సి ఉంటుందన్నారు. రోబోటిక్ టెక్నాలజీ కచ్చితమైన చికిత్స ద్వారా రక్త స్రావం లేకపోవడంతో రోగి త్వరగా కోలుకుంటాడన్నారు. కార్యక్రమంలో మెడికవర్ ఆస్పత్రి రీజనల్ హెడ్ పద్మజ, సెంటర్ హెడ్ అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు మహాసభల లోగో ఆవిష్కరణ


తెలుగు మహా సభల లోగో ఆవిష్కరిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

విశాఖ స్పోర్ట్స్: 3వ ప్రపంచ తెలుగు మహాసభల లోగోను శాసనసభ స్పీకర్ చింతకాయల అయన్నపాత్రుడు సోమవారం ఈస్ట్‌పాయింట్ గోల్ఫ్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తెలుగు భాష, యాస భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ మాతృభాషలో మాట్లాడాలన్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆంధ్రమేవ జయతే అంటూ నినదిస్తున్నామన్నారు. ఆంధ్రలో ఇప్పటికే రెండు సభలు నిర్వహించామన్నారు. కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరిస్తున్న పి.రామచంద్రరాజు మాట్లాడుతూ 2026 జనవరి 3, 4, 5 తేదీల్లో అమరావతి గుంటూరు హైవే శ్రీ సత్యసాయి స్పిరిచ్యువల్ సిటీ గ్రౌండ్స్‌లో జరిగే ఈ సభ జరుగుతుందన్నారు. భాషాభిమానులే అన్ని బాధ్యతలు తీసుకుని నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రులతో సహా పలువురు గౌరవనీయుల్ని ఆహ్వానిస్తున్నామన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర చైర్మన్ వై.రామారావు మాట్లాడుతూ గతేడాది 20 బ్లడ్‌బ్యాంక్‌ల ద్వారా లక్ష యూనిట్ల రక్తాన్ని సేకరించి అందచేశామన్నారు. ఆరు బ్లడ్‌బ్యాంక్‌ల ద్వారా తలసేమియా వ్యాధిగ్రస్తులకు ఉచితంగానే రక్తం అందించామన్నారు. ఈ సందర్భంగా రక్తదానం చేయండంటూ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రచార పత్రికను స్పీకర్ అయ్యన్నపాత్రుడు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ యువ వలంటీర్లు పాల్గొన్నారు.

జూ కాంట్రాక్ట్ ఉద్యోగులకు కనీస వేతనాలివ్వాలి

ఆరిలోవ: జూ పార్కులో ఏళ్ల తరబడి పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు కనీసం వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జూ పార్కును మంగళవారం సందర్శించనున్న ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ కాంట్రాక్ట్ ఉద్యోగుల వేతనాల గురించి స్పందించాలన్నారు. ఇక్కడ పనిచేస్తున్న కార్మికులు ప్రమాదవశాత్తు మరణించినా, సాధారణ మరణం పొందినా ఎలాంటి రక్షణ, భరోసా లేదన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో అన్నింటికీ విపరీతమైన ధరలు పెరిగిపోయాయని, వాటికి తగినట్లుగా కార్మికులు వేతనాలు లేకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన కార్మికుల కుటుంబాలను జూ యాజమాన్యం ఆదుకునేలా చర్యలు చేపట్టాలని కోరారు.

బాబోయ్ దుర్వాసన..!


పైనాపిల్ కాలనీలో గెడ్డలో పేరుకుపోయిన చెత్త


వ్యర్థాలతో నిండిన వీధి కాలువ

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు పైనాపిల్ కాలనీలో బీఆర్‌టీఎస్ రహదారి పక్కన నివాసాలను ఆనుకొని ఉన్న గెడ్డ చెత్త కుండీగా మారింది. ఇక్కడి వీధి కాలువలదీ ఇదే పరిస్థితి. దారంపాలెం, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, హుద్‌హుద్ నివాసాలు, పైనాపిల్ కాలనీ నుంచి మురుగు నీటితోపాటు వచ్చిన చెత్త ఈ గెడ్డలో పేరుకుపోయింది. నెలల తరబడి చెత్త ఇక్కడ దిబ్బలుగా నిల్వ ఉండిపోయింది. దీని నుంచి వస్తున్న దుర్వాసనతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో పాటు పైనాపిల్ కాలనీలో వీధి కాలువల నుంచి వాడుక నీరు కూడా ఈ గెడ్డలోకే ప్రవహిస్తుంది. గెడ్డలో చెత్త నిల్వ ఉండిపోవడంతో కాలువల నుంచి మురుగు నీరు కిందకు ప్రవహించే మార్గం మూసుకుపోయింది. గెడ్డతో పాటు కాలువల్లో కూడా ప్లాస్టిక్ బాటిళ్లు, పాలిథిన్ కవర్లు, చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు. శానిటరీ సిబ్బంది వీటిలో చెత్త తొలగించకుండా నెలల తరబడి వదిలేస్తున్నారని చెబుతున్నారు. ఇక్కడ కాలువలు, గెడ్డను శుభ్రం చేయాలని కోరుతున్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి


ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జిల్లా వైద్యా ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. రేసపువానిపాలెంలో మొదలైన ర్యాలీ సత్యం కూడలి మీదుగా తిరిగి రేసపువానిపాలెం వరకు సాగింది. డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు మాట్లాడుతూ మంచి అలవాట్లతో ఆరోగ్యం సొంతమవుతుందన్నారు. సాధ్యమైనంతవరకు మంచి నీరు తాగడం, ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవించడం, బలమైన ఆహారం భుజించడం, చక్కని గాలి, వెలుతురు ఉన్న ప్రదేశంలో నివసించడం వంటివి చేయాలన్నారు. తల్లీ, బిడ్డల ఆరోగ్య విషయంలో మరింత జాగ్రత్త వహించాలని సూచించారు. ర్యాలీలో జిల్లా ప్రోగ్రాం అధికారులు, నర్సింగ్ విద్యార్థినులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కరకచెట్టు పోలమాంబ సన్నిధిలో పుట్ట బంగారం పూజ


పుట్ట బంగారం పూజలో పాల్గొన్న ముువ్వల సురేష్, నాయకులు

బీచ్‌రోడ్డు: పెదవాల్తేరు కరకచెట్టు పోలమాంబ అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా సోమవారం పుట్ట బంగారం తీసుకొచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముువ్వల సురేష్ పోలమాంబను దర్శించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.